

**జరిగిన కథ :** ఒంటరి అయిన పితృదత్తపై ధారానగర ఉద్యోగులు కన్నేశారు. వారిని తెలివిగా ఒక చెక్కపెట్టెలో బంధించి, భోజరాజుకు అప్పగించిందామె. కానీ, ఆయన వారిని శిక్షించకుండా కేవలం ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పించి విడిచిపెట్టేశాడు. దాంతో వారివల్ల ఎప్పటికైనా తనకు, తన కొడుక్కి ప్రాణహాని కలగవచ్చనే భయంతో.. పితృదత్త పాటలీపుత్రానికి ప్రయాణం పెట్టుకుంది. మధ్యలో ఆ తల్లీకొడుకులకు కామందకుడనే వాడు పరిచయం అయ్యాడు.




# గల్లంతైన ఫణిదత్తుడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

కామందకుని మనసులోని మర్మమేమిటో పితృదత్త ముందస్తుగా కనిపెట్టలేకపోయింది. కానీ, అతను ధారానగర వాసియేననీ, చిన్నతనం నుంచి పితృదత్తపై మనసు పెట్టుకుని.. ఇప్పుడిలా సమయం చూసి ఆమెను లోబరుచుకోవాలనే ఆలోచనతోనే వెంబడించాడని తెలిసిన తరువాత తట్టుకోలేకపోయింది.

వాణ్ని నాలుగు తిట్టి తరిమేసింది. కానీ, ధారానగరం నుంచి పాటలీపుత్రానికి రెండునెలల ప్రయాణం ఉండటంతో.. దారి పొడవునా ఎన్నోరకాలుగా ఆమెను కామందకుడు ఆటంక పరచసాగాడు. ఆ సమయంలో ఫణిదత్తుడే కనుక అడ్డుగా లేకపోతే పితృదత్త ఏమయ్యేదో!

కామందకుని వల్ల ఎన్నో కష్టాలు పడుతూ, ఎట్టకేలకు పితృదత్త కొడుకుతో కలిసి పాటలీపుత్రం చేరుకుంది. అప్పటికే ఆమె మేనమామలు దేశం విడిచిపెట్టి వెళ్లిపోయారు. మాతామహుడి సోదరుడొకడు అక్కడే ఉండటంతో ఆయనింటికి చేరుకుంది పితృదత్త.

ఆ గృహస్థు తన మనవరాలిని చూసి సంతోషించాడు. కానీ, ఆమె వెనకే దూసుకువచ్చిన కామందకుడు..

''తాతగారూ! నేను మీ మనవరాలి భర్తను. ఈమె కాపురాన్ని కాలదన్ని చెప్పాపెట్టకుండా మీ ఇంటికి వచ్చేసింది'' అని చెప్పాడు.

దాంతో ఆ ముసలాయన సందిగ్ధంలో పడ్డాడు.

''అమ్మా! ఈ తగువేమిటి? వీడిలా చెబుతున్నాడేమిటి? నిజం చెప్పమ్మా!'' అని బుజ్జగించి అడిగాడు.

పితృదత్త జరిగినదంతా చెప్పింది. దాంతో ముసలాయన కామందకుణ్ని ఇంటినుంచి వెళ్లగొట్టాడు. అయినా వాడు విడిచిపెట్టకుండా వీధిలోకి వెళ్లి కొంత అల్లరి చేశాడు. ఇరుగు పొరుగువాళ్లలో కొందరు నందరాజుగారి వద్ద అభియోగం తెమ్మని సలహా చెప్పారు.

మరునాడు ఆ తగవు విని, పితృదత్త మాతామహుణ్ని నందరాజు సభకు పిలిపించాడు.

''పితృదత్త భర్తపేరు నాగరాజు. అతను విదేశాలలో ఉన్నాడు. ఈ కామందకుడు కుబుద్ధితో ఆమె వెంటపడుతున్నాడు'' అని చెప్పాడు మాతామహుడు.

''మీ మనవరాలి కుమారుడికి పదేళ్ల వయసు ఉంటుంది కదా! అతణ్ని పిలిస్తే ఈ విషయంలో సాక్ష్యం చెప్పగలడా?!'' అని అడిగాడు నందరాజు.

''చిత్తం!'' అని సమాధానమిచ్చాడు మాతామహుడు.

తన ముందుకు వచ్చి ఠీవిగా నిలబడ్డ ఫణిదత్తుడి తేజస్సును చూసి, నందరాజు ఆశ్చర్యపోయాడు.

'ఇతడు విప్రబాలకుడంటే నమ్మడం ఎలాగ?! రూపంలో మన్మథుణ్ని మించినవాడు. చక్రవర్తి కాగల చిహ్నాలు కనిపిస్తున్నాయి' అని మనసులో తలపోశాడు.

''బాలకా! నీ పేరేమిటి? ఏం చదువుతున్నావు?'' అని గంభీరంగా ప్రశ్నించాడు.

''నాపేరు ఫణిదత్తుడు! ప్రస్తుతం వ్యాయామాగమ విద్య చదువుతున్నాను'' చెప్పాడు ఫణిదత్తుడు.

''వేదశాస్త్రాలను మాని, క్షత్రియులకు ఉచితమైన విద్యలెందుకు చదువుతున్నావు?''.

''మా గురువులు వాటితోపాటు ఇవికూడా చెబుతున్నారు. నాకిది చాలా ఇష్టమైన అంశం''.

''సరే! ఎక్కడ నేర్చుకుంటున్నావు?''.

''ధారానగరంలో ప్రభూ! భోజరాజుగారి వ్యాయామ పాఠశాలలో చదువుకుంటున్నాను. ఆయన మా కుటుంబానికి నెలకు మూడువందల భత్యంతోపాటుగా, నాకు చదువుకూడా చెప్పిస్తున్నారు''.

''అయితే భోజరాజుగారు మిమ్మల్ని బాగా ఎరుగునన్న మాటేకదా!''.

''ఎరుగును మహారాజా!''.

''మరి అక్కణ్నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చేశారు?''.

''అక్కడ మాకు దగ్గరి చుట్టాలెవ్వరూ లేరు. అందువల్ల ఆ విద్యలన్నీ ఈ నగరంలోనే నేర్పిస్తానని నన్ను మా అమ్మ తీసుకువచ్చేసింది''.

''సరే! సాములో నువ్వెంత సాధన చేశావు?!''.

''మహారాజా! చక్రపరివర్తనం, లంఘనాతిలంఘనం, దండపరిక్రీడనం, విచిత్రకౌక్షీయక ప్రక్షేపణం, పరిప్లుత వ్యాప్తి, శరీరగుప్తి మొదలైన సాధనలలో మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడినయ్యాను''.

''ఏదీ.. నీ చక్రపరిభ్రమణ పాటవం చూద్దాం. ఆ మేడ ఎక్కి దిగు'' అన్నాడు నందమహారాజు.

''చిత్తం'' అంటూ ఫణిదత్తుడు నడుముకు దట్టీ